# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం
ఏలూరు

మార్చ్ 2025



విశ్వావసు **ఉగాది** శుభాకాంక్షలు

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

మార్చ్ , 2025

## విషయ సూచిక

సంపుటి-4

సంచిక-3


01 సంపాదకీయం — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

03 శ్రీ గణేశ పురాణం — శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య

04 శ్రీ వేంకటేశ్వర రహస్యం — శ్రీమతి నిడుముక్కల శ్రీకరి

05 పురాణంలో మహిళలు — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

06 ఐశ్వర్యయోగం — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

07 ఋషిచరిత్ర — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

08 కాశీ కథలు — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

09 స్తోత్రమాలిక — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

10 గురుదేవుల జీవన కవనము — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం


శ్రీ మహాగణాధిపతయే నమః          శ్రీ గురుభ్యోనమః          శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




యజ్ఞములు ద్వారా, అగ్నికార్యముల ద్వారా పరమాత్మతో మనలను అనుసంధానం చేస్తాడు పంచభూతదివ్యస్వరూపుడు అగ్నిభగవానుడు.ఆ అగ్నిభగవానుని ద్వారా వశిష్ఠునికి చెప్పబడి వేదవ్యాసునిచే లోకానికి అందించబడినది ఈ అగ్నిపురాణం. సంక్షిప్తంగా నవాహ (౯ రోజుల) పారాయణమునకు వీలుగా అభినవశుక, ప్రవచననిధి పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు, వారి దివ్యాశీస్సులతో తమ శిష్యులచే సంకలం చేయించిన ఈ గ్రంథాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణ చేసినవారికి సమస్త వాస్తుదోషాలు, శత్రుపీడలు తొలగి, భయంకర కష్టాల్లోంచి బయటపడతారు. పుష్కరంలో స్నానం చేసి నూరు కపిలగోవులను దానం చేసిన మహాఫలితం పొందుతారు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

శ్రీ ప్రణవపీఠం

सत्यं वद - धर्मं चर

ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# సంపాదకీయం

## శుభాకాంక్ష

**ఫాల్గుణ** మాసంలో సంపదలకు అధిదేవత అయిన శ్రీమహాలక్ష్మీదేవిని పూజిస్తే సకల ఐశ్వర్యాలు కలుగుతాయి. నిత్యసత్యస్వరూపిణి అయిన ఆ తల్లి అనుగ్రహం వల్లనే మనం శాశ్వతమైన ఆనందాన్ని పొందగలం. ఆ జగన్మాత జన్మతిథి 'ఫాల్గుణ పూర్ణిమ'. సర్వసాక్షియైన ఈ భగవద్దర్శనశక్తిని లక్ష్మిదేవీగా ఉపాసించటం శుభప్రదం. ఎక్కువమంది ఆనందాన్నీ, ఐశ్వర్యాన్నీ, జ్ఞానాన్ని, లక్ష్యంగా పెట్టుకొనే జీవిస్తారు. అటువంటివారికి మహాలక్ష్మి ఉపాసన పరమ కర్తవ్యం.ఇదే మాసంలో వచ్చే హోలీ పండుగను భారతదేశంలోని ప్రముఖమైన పండుగ .హోలీ పండుగను కూడా ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజునే జరుపుకుంటారు. హోలీ ప్రధానంగా రంగుల పండుగ. అన్నిటా భగవంతుని దర్శించే మహాత్ములు భారతీయులు. అందుకే భగవద్గీతలో గీతాచార్యుడు 'సర్వాన్నీ నడిపించే కాలాన్ని నేనే' అన్నాడు. కాలం విజయాన్ని ప్రసాదించేది, మార్పులను తెచ్చేది అని గ్రహించి కాలాన్ని ఉపాసించేవారు ధన్యులు. ఋతువుల్లో వసంతం మనోహరమైనది. ఆహ్లాదకరమైనది. 'ఋతూనాం కుసుమాకరః' ఋతువుల్లో వసంతఋతువు తానే అన్నాడు శ్రీకృష్ణుడు. అందుకే సంవత్సర ఆరంభానికి దీన్నే ప్రామాణికంగా తీసుకొని తొలి ఋతువుగానూ భావిస్తారు. అలాంటి వసంతఋతువులో వచ్చే మొదటిమాసం చైత్రం. బ్రహ్మ సృష్టి ఆరంభించినది చైత్రశుద్ధ ప్రతిపత్ తిథి నాడే అని బ్రహ్మపురాణం చెబుతోంది. అదే యుగాది. ఉగాదిని సక్రమంగా జరిపితే సంవత్సరమంతా శుభప్రదంగా ఉంటుంది.ఉగాదిపండగ పేరు చెప్పగానే ఎవరికైనా ముందు గుర్తువచ్చేది 'ఉగాది పచ్చడి'. మామిడిపిందెలు, వేపపువ్వు, కొత్తబెల్లం, చింతపండు, పచ్చిమిరప, ఉప్పు వేసి చేసే ఈ పచ్చడిలోని ఆరు రుచులు జీవితంలోని సుఖదుఃఖాలకు ప్రతీకలు. ఈ జీవనతత్త్వం ఎలా ఉన్నా వేసవి ఆరంభంలో షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి తినడం వల్ల ఆరోగ్యం బాగుంటుంది.ఉగాది నాడు విధిగా పంచాంగాన్నీ వినాలి.పంచాంగ శ్రవణం వల్ల జాతక దోషాలు పరిహారమై శుభాలు కలుగుతాయి. ఇది మన ఖగోళ జ్ఞాన సంబంధమైనది. ఇందులో ఐదు అంగాలుంటాయి. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలు. పంచాంగం తెలుసుకొంటే ఈ క్రింది ప్రయోజనములు కలుగుతాయని శాస్త్రం. తిథి వలన సంపదలు కలుగుతాయి (15 తిథులు: శుక్ల, కృష్ణ పక్షములలో), వారము వలన ఆయుష్షు పెరుగుతుంది (7 రోజులు), నక్షత్రము వలన పాపము తొలగుతుంది (27 నక్షత్రములు), యోగము వలన రోగనివారణము జరుగుతుంది(27 యోగములు), కరణం వలన కార్యసిద్ధి (11 కరణములు) కలుగుతుంది.శాస్త్రీయ కార్యక్రమాలను అచరిస్తూ సత్యం వద, ధర్మం చర అన్న ప్రణవపీఠ మార్గంలో సాధకులు నడుచుకోవాలి. ఈ విశ్వావసు నామ సంవత్సరములో అందరు అనేక శుభాలు పొందుదురు గాక అని అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను

వద్దిపర్తి పద్మాకర్



శ్రీ ప్రణవపీఠం వారి
## విద్యా నిధి
ఏలూరు

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి దివ్యానుగ్రహముతో శ్రీ ప్రణవ పీఠం ,విద్యానిధి బృందం అంతర్జాల వేదిక పై జూమ్ మాధ్యమము ద్వారా విద్యార్థులకు వీణ కూచిపూడి,వయోలిన్ తరగతులు నిర్వహించారు.

**ఉపాధ్యాయుల వివరములు:**

వయోలిన్ :చి. కోడె శాస్త

వీణా వాదిని: శ్రీమతి శైలజ లింగాల గారు


కూచిపూడి : కుమారి పూర్వజ బొమ్మిరెడ్డిపల్లి

విద్యార్థులకు, ఉపాధ్యాయులకు గురుదేవులు ఆశీస్సులు అందజేసారు.






## చిత్రములలో జూమ్ ద్వారా అభ్యసిస్తున్న విద్యార్థులను చూడవచ్చు



# శ్రీ గణేశ పురాణం



**గణపతి** సకల దేవగణాధిపతి. ఆయన పరశురామునికి భూలోకం, భువర్లోకం, స్వర్లోకం, జనోలోకం, తపోలోకం, ధ్రువలోకం, ఆపై గౌరీలోకం, శంభులోకం, గిరగిరా తొండంతో పట్టుకొని త్రిప్పుతూ చూపించాడు. అలా తిరుగుతున్న పరశురాముడు సప్తసముద్రాలలో కూడా గిరగిరా త్రిప్పబడుతూ, ఆ జలాలను త్రాగాడు. త్రాగిన సముద్రజలాలను కక్కి వేసాడు. కక్కుతున్నప్పుడు గణపతి ఆయనను సముద్ర జలాలలో పారవేసి ఉక్కిరి బిక్కిరి చేసి, మళ్ళీ తొండంతో చుట్టాడు. యోగమాయా ప్రభావాన్ని ప్రదర్శిస్తూ వైకుంఠ దర్శనం చేయించాడు. వైకుంఠంలో నాలుగు చేతులతో ఉన్న నారాయణుని, శ్రీమహాలక్ష్మిని పరశురాముడు దర్శించాడు. తన తొండాన్ని అనంతంగా పెంచి, గోలోకాన్ని, అక్కడి విరజానదిని, బృందావనాన్ని, శతశృంగ పర్వతాన్ని, రాసమండలాన్ని కూడా చూపించాడు. గోలోకంలో రెండు చేతులతో మురళిని ధరించి అనేక దివ్యాభరణాలు, ధరించి, రత్నసింహాసనంపై కూర్చుని ఉన్న శ్రీకృష్ణుడు, ఆయన ప్రక్కన కూర్చొని ఉన్న ప్రేమైక స్వరూపిణి అయిన రాధ — ఈ ఇరువురినీ భార్గవుడు చూసాడు. సకలలోకేశ్వరుడు, తన అవతారానికి మూలకారకుడు, పరమాత్మ, జగద్గురుడు అయిన శ్రీకృష్ణుని చూడడంతోనే భార్గవరాముడు చేసిన క్షత్రియ హింసాపాపం నశించిపోయింది. వినాయకుని దయవల్ల పరశురాముడు అన్ని పాపాల నుండి విముక్తి పొందాడు. ఎంతటి అవతారమూర్తి అయినా భూలోకంలో ఉన్నప్పుడు తాను చేసిన కర్మలను అనుభవించాలి అని హరి ఒకప్పుడు చెప్పాడు. ఆ కర్మల ఫలితం కావాలంటే తొలగించుకోవచ్చు కాని శ్రీమహావిష్ణువు అలా చేయడు. పరశురాముడు శ్రీమహావిష్ణుని అవతారమే. అయినా కర్మల ఫలితం అనుభవించాలి కనుక గణపతి ఆయనను ఇన్ని లోకాల చుట్టూ త్రిప్పి, సముద్ర జలాలు త్రాగించి, అనేక లోకాలను చూపించి, చివరగా శ్రీకృష్ణుని దర్శనం చేయించాడు. శ్రీకృష్ణ దర్శనంతో పూర్తిగా తన కర్మల ఫలాలను పూర్తిగా వదలించుకొన్నాడు పరశురాముడు. చివరకు సంపూర్ణ చైతన్యాన్ని పొందాడు. అలా పొందగానే అతడు తన ఇష్టదైవమైన శ్రీకృష్ణుని తన మనస్సులో భక్తితో ధ్యానించాడు. తన గురువు, మార్గదర్శకుడు అయిన శంకరుని ప్రార్థించాడు. శంకరుడు ఒకప్పుడు పరశురామునికి శ్రీకృష్ణకవచాన్ని ప్రసాదించాడు. ఆ కవచాన్ని రాముడిప్పుడు పఠించాడు.

.. ఇంకా ఉంది

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

## దానాలు – ఫలితాలు



**వేంకటాచలంలో** ఒక్క దినమున చేసిన స్నాన దాన ఫలితం శ్రుతదేవుడు ధారపోయడంతో హేమాంగునికి సద్గతులు కలిగాయంటే, నిరంతరం అక్కడకు వెళ్ళి సత్కార్యాలు చేసే వారికి కలిగే సత్ఫలితాలు ఎలా ఉంటాయో ఆలోచించండి. వేంకటాచలం భూలోకవైకుంఠం. నమ్మిన వారికి తత్ క్షణం శుభాలు కలిగించే కొండంత అండనిచ్చే కొండ. ఆ కొండపై చేసే పాపాలు కూడా అంతే. అంతులేని నరకాలనిస్తాయి. ఇది గ్రహించి ఆ కొండపై పిచ్చిపనులు చేయకుండా జాగ్రత్త పడాలి. వేంకటాచలం సర్వపాపాలను ఆ క్షణమే తొలగించే క్షేత్రం. తెలిసి చేసినా తెలియక చేసినా పుణ్యమైనా, పాపమైనా అనుభవించి తీరవలసిందే. స్వామివారికి చేసే సేవలు, అర్చనలు ఎన్ని యుగాలైనా జీవులను అనుగ్రహించి వెంట వస్తాయి. స్వామివారి ప్రసాదాలలో కాని, ఆభరణాలు, వస్త్రాలు, మున్నగు వాటిలోకాని అపచారం చేసినవారు దుర్మరణం పాలవుతారు. ఎన్ని యుగాలైనా ఆ పాపాల నుండి విముక్తులు కాలేరు. నరక శిక్షలు అనుభవిస్తారు. హేమాంగుడు స్వర్గంలో పదివేల సంవత్సరాలు భోగాలు అనుభవించాడు.

శ్లో॥ తత్ర భుక్త్వా మహాభోగాన్ వర్షాయుతమతంద్రితః
స ఏవ చేక్ష్వాకు కులే కకుత్థ్సో ఽభూన్మహారథః ॥
(స్కాం.పు.వై.ఖం.వేం.మా.అ.16.శ్లో.43)

స్వర్గంలో పదివేల సంవత్సరాలు భోగాలు అనుభవించాక ఆతడే మరలా ఇక్ష్వాకు వంశంలో తిరిగి జన్మించాడు. ఈ జన్మలో ఆయనకు కకుత్థ్సుడు అని పేరు. ఆయన పేరు మీదుగా ఇక్ష్వాకు వంశం కాకుత్థ్స వంశం అయ్యింది. సప్తద్వీపాలతో కూడిన భూమండలాన్ని పరిపాలించి ఘనకీర్తిని పొందాడు. వేదాలు శాస్త్రాలు నేర్చాడు. ధనుర్విద్యలో నైపుణ్యం సంపాదించాడు. అనేక దానాలు ధర్మాలు చేసాడు. సాధువులు ఆయనను ప్రశంసించారు. "దేవేంద్రస్య సమో విష్ణోరంశ ఏవం మహాప్రభుః" – శ్లో.44. దేవేంద్రునితో సమానుడు అయ్యాడు. విష్ణుని అంశ ఆయనలో ఉండేది. మహాప్రభువుగా కీర్తి పొందాడు. ఆ వంశం వారందరికీ కులగురువు వశిష్ఠుడే కనుక, ఈ జన్మలో కూడా కులగురువు బోధలు విని సకల ధర్మాలను పాటించాడు. సర్వపాపాలను తొలగించుకొన్నాడు. గురువు సకల గుణాలను తొలగించి, నిర్గుణపరబ్రహ్మాన్ని అందించే మహానుభావుడు. అందువల్లనే జ్ఞానులు 'గురోరన్యం న విద్యతే', అన్నారు. గురుని అనుగ్రహంతో ధర్మాచరణం చేసి, దివ్యజ్ఞానం పొందాడు. చివరకు విష్ణువులో లీనమయిపోయాడు.

శ్లో॥ తస్మాద్వేంకట శైలేంద్రః పుణ్యః పాపవినాశనః
తస్మింశ్చ జలదానం తు విష్ణులోక ప్రదాయకమ్ ॥
ఏవం వః కథితా విప్రా జలదానస్య వైభవమ్ ॥
వేంకటాద్రే మహాపుణ్యే సర్వపాతక నాశనే ॥

(స్కాం.పు.వై.ఖం.అ.16.శ్లో.46,47)

....ఇంకా ఉంది

# పురాణం లో మహిళలు

## దేవహూతి




**దేవహూతి** కర్దమ ప్రజాపతి భార్య. ఆమె కపిల మహర్షి తల్లి. స్వాయంభువ మనువు మరియు శతరూపుడు తల్లిదండ్రులు. ఆమెది ప్రత్యేకమైన అందం. ఒకసారి ఆమె తన రాజభవనం ముందు తన స్నేహితులతో ఆడుకుంటుండగా, ఆకాశంలో ఎగురుతున్న ఒక గంధర్వుడు ఆమె అందాన్ని చూసి స్పృహ తప్పి తన విమానం నుండి భూమిపై పడిపోయాడు. కర్దమ మహర్షి సృష్టికర్త బ్రహ్మ యొక్క మానసపుత్రుడు. . బ్రహ్మ సృష్టిని ముందుకు తీసుకెళ్లమని ఆదేశించాడు. నిజానికి కర్దముడికి వైవాహిక జీవితంపై ఆసక్తి లేదు. అతను సన్యాసిగా జీవించాలనుకున్నాడు. కానీ అతని తండ్రి ఆజ్ఞాపించినప్పుడు, దానిని పాటించడం తన విధిగా భావించి వివాహం చేసుకోవాలనుకున్నాడు. భాగవత పురాణం ప్రకారం, తన తండ్రి బ్రహ్మ ఆదేశాన్ని అనుసరించి, కర్దమమహర్షి విష్ణువు కోసం పదివేల సంవత్సరాలు తపస్సు చేసాడు. విష్ణువు ప్రత్యక్షమై వరం కోరినప్పుడు, కర్దముడు తన తండ్రి ఆజ్ఞను పాటించడానికి తగిన భార్యను కోరాడు. అప్పుడు విష్ణువు, స్వాయంభువ మనువు మరియు శతరూపుల కుమార్తె అయిన దేవహూతి కర్దముడికి తగిన భార్య అని చెప్పాడు. మనువు మరియు శతరూప అతి త్వరలో తమ కుమార్తెతో కర్దముని ఆశ్రమానికి వచ్చి అతనికి వివాహ ప్రతిపాదన చేస్తారని విష్ణువు తెలియజేస్తాడు. విష్ణువు సలహా మేరకు, ఒకరోజు స్వాయంభువ మనువు మరియు శతరూపుడు వారి కుమార్తె దేవహూతితో కలిసి కర్దమ మహర్షి ఆశ్రమానికి వచ్చారు ఎందుకంటే వారు దేవహూతితో తన వివాహం గురించి మాట్లాడినప్పుడు, ఆమె కర్దమ మహర్షిని వివాహం చేసుకోవాలనే కోరికను వ్యక్తం చేసింది. నారద మహర్షి మరియు ఇతర సాధువుల నుండి కర్దముని గొప్పతనాన్ని విన్న దేవహూతి, అతన్ని తన భర్తగా స్వీకరించాలని నిర్ణయించుకుంటుంది. ఆమె తన తల్లిదండ్రులకు కూడా అదే చెబుతుంది. కర్దముడు కూడా ఆమెను వివాహం చేసుకోవడానికి అంగీకరిస్తాడు. వివాహం చేసుకోవడానికి అతను ఒక షరతు పెడతాడు. బిడ్డ పుట్టిన వెంటనే, అతను సన్యాసాశ్రమాన్ని స్వీకరిస్తానని షరతు పెడతాడు. దేవహూతి ఈ షరతును అంగీకరించి వివాహానికి అంగీకరిస్తుంది. మనువు, శతరూప వారిని వివాహం చేసి వెళ్ళిపోతారు.

## ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః | శ్రీ మాత్రేనమః | శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

### 341. క్షేత్రస్వరూపా (ఓం ఐం హ్రీం శ్రీం క్షేత్రస్వరూపాయై నమః)



**క్షేత్రం** అనే శబ్దానికి శరీరం అని ఒక అర్థం. జీవుల శరీరాలన్నీ అమ్మవారి స్వరూపాలే అని గ్రహించాలి. క్షేత్రం అనగా వరిపొలం. పంటలు పండించే భూములన్నీ అమ్మవారి రూపాలు. ఆకాశం, పుణ్యస్థలాలు కూడా క్షేత్రమనే పిలవబడతాయి. పుణ్యతీర్థస్థలాలన్నీ అమ్మవారి రూపాలే. ఆకాశం, రాశులు, నక్షత్రాలు ఇవి అన్నీ క్షేత్రాలే కనుక ఇవి అన్నీ అమ్మవారి స్వరూపాలే అని గ్రహించాలి. ఇరవైనాలుగు తత్త్వాలను క్షేత్రం అంటారని లింగపురాణం చెపుతున్నది. చతుర్వింశతి తత్త్వస్వరూపిణి అమ్మ. సుఖదుఃఖాలను అదుపులో ఉంచి జీవులను పాలిస్తూ జీవస్వరూపంగా ఉండునది అమ్మవారే.

#### మంత్రప్రయోగవిధానం — ఫలితం

కొంతమంది శరీరంపైనా, ఇంద్రియాలపైనా, మనస్సుపైనా నిగ్రహం కోల్పోయి అనవసరంగా వివాదాలలో చిక్కుకొంటారు. అటువంటివారికి మంత్రం అద్భుతమైనది. ఈ మంత్రాన్ని అష్టమీ, నవమీ చతుర్దశీ తిథులలోనూ, ముఖ్యమైన పనులపై వెళ్ళేటప్పుడూ 108 సార్లు జపించుకొంటే లేనిపోని తగాదాలు రావు. మన శరీరం, మనస్సు మన అదుపులో ఉంటాయి.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# ఋషి చరిత్ర

## జమదగ్ని మహర్షి



**తపోబల** సంపన్నుడైన జమదగ్ని క్షత్రియుల చేతిలో హతం కావటానికి పురాణాల్లో ఒక కథనముంది. అనుచిత సమయంలో వచ్చి తన ఏకాంతాన్ని భంగం చేయటమే కాకుండా, తనకు నీతిధర్మాలు చెప్పిన సూర్యునిపై కోపగించి నీవు రాహుగ్రస్తుడవై, పాపదృశ్యుడవై, హతతేజుడవుతావు అని జమదగ్ని సూర్యుని శపించాడు. ఆ శాపానికి సూర్యుడు కూడా ఆగ్రహించి, నీవు ఒక క్షత్రియుని చేతిలో మరణిస్తావు అని ప్రతిశాపం ఇచ్చాడు. ఆ కారణంగా జమదగ్ని క్షత్రియుని చేతిలో మరణించాడు. ఇక్కడ మనకు కొన్ని నీతిసూత్రాలు కనబడుతాయి. దీక్షాసమయంలో ఉన్న ఋషులు కోపాన్ని పరిత్యజించాలి. ధర్మమార్గం తప్పరాదు.

వసువు, విశ్వావసువు మరియు పరశురాముడు అనే మగపిల్లలు కలిగారు. పిల్లలు తల్లిదండ్రులను పార్వతీపరమేశ్వరులతో సమానంగా గౌరవిస్తూ శుశ్రూషలు చేస్తున్నారు. భార్య రేణుక కూడా భర్త సేవలో ఎటువంటి లోటు రానీయకుండా చూసుకుంటోంది. ఒకనాడు రేణుక మంచినీటి కోసం దగ్గరలోని కొలనుకు వెళ్ళింది. ఆ సమయంలో ఒక గంధర్వరాజు తన భార్యలతో జలక్రీడలాడుతున్నాడు. ఈ సంఘటనను మనసులో ఎటువంటి వికారం గాని, చెడు భావనగాని లేకుండా క్షణకాలం తిలకించింది. ఈ సందర్భంలో ఆమె చేతిలోని కడవ అప్రయత్నంగా జారి కిందపడి పగిలిపోయింది. ఆమెకు గతంలో నదిలోని మట్టితో కడవలు చేసేది. అందువల్ల ఆమె ఈసారి ప్రయత్నించగా కడవ తయారు చేయలేకపోయింది. అప్పుడు ఆమె తనవల్ల తప్పు జరిగిందని గ్రహించి, దానికి పరిహారం తన భర్త అనుజ్ఞ తీసుకున్న తరువాతే నిర్వర్తించాలని అనుకుని ఇంటికి చేరుకుంది. ఆమె ఇంటికి చేరుకోగానే జమదగ్నికి విషయం అవగతమయ్యింది. ఆమె చేసిన తప్పుకు మరణదండన మాత్రమే సరైందని భావించి, తన కుమారులను పిలిచి రేణుకను వధించమని ఆదేశించాడు. కాని నలుగురుకుమారులు తల్లిని వధించటానికి అంగీకరించలేదు. కాని పరశురాముడు తండ్రి ఆదేశాన్ని శిరసావహించాడు. తన ఆజ్ఞను ఉల్లంఘించిన సోదరులను కూడా వధించమని చెప్పాడు. దానిని కూడా పరశురాముడు పాలించాడు. సంతోషించిన తండ్రి వరం కోరుకోమని అడగ్గా, తన తల్లిని మరియు సోదరులను బ్రతికించమని కోరాడు. దానికి జమదగ్ని అంగీకరించి వారిని బ్రతికించాడు.

...ఇంకా ఉంది

# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం



**నీకు** భయము లేకుండా నేను చెప్పిన విధముగా విభూతిని ధరించి స్నానం చేయి నిన్ను ఏ దేవతలూ తీర్థ ప్రవేశం చేయకుండా ఆపలేరు.ఎవరైతే శివ మంత్రముతో అభిమంత్రించబడిన విభూతిని ధరిస్తారో వారిని ఎటువంటి భయాలు,హింసా,కష్టములు తాకవు.శరీరం పై శివమంత్రమును చదువుతూ ధరించినటువంటి భస్మం అన్ని విధములైన భయములనుండి రక్షణ కలిగిస్తుంది".ఈ విధముగా పలికి చేతిలో భస్మము తీసుకొని రాక్షసుని చేతిలో కొంచం పెట్టెను. రాక్షసుడు ఆ భస్మమును ధరించి విమలోదక తీర్థములో స్నానం చేసేను.జలరక్ష దేవతలు భస్మధారణ చేసిన ఈ పిశాచిని చూసినప్పటికీ,పిశాచి అయినా భస్మం ధరించినందువలన జలరక్షణ దేవతలు కూడా ఏమీ చేయలేకపోయారు.పిశాచి స్నానమాచరించి, తీర్థ జలమున స్వీకరించాడు,కపర్దీశ్వరుడుని మనసారా ప్రార్థించాడు.వెంటనే అతని శరీరం దివ్యకాంతిని పొందింది,దివ్య వస్త్రములు వచ్చి చేరాయి, దివ్యమాలలు అతని శరీరంపైన వచ్చాయి,అతని శరీరం నుండి సువాసనలు వచ్చాయి. అక్కడికి ఒక దివ్య విమానం కూడా వచ్చింది.ఆ విమానము నుండి దివ్య రూపధారులైన దేవతలు అతనికి నమస్కరించి విమానంలోకి ఆహ్వానం పలికారు. పిశాచ రూపము నుండి ముక్తి పొందిన తర్వాత వాల్మీకి ముని దర్శనం చేసుకొని దివ్య విమానం ఎక్కాడు. అతడు ఆకాశ మార్గమున వెళుతూ వాల్మీకి మునితో ఈ విధంగా చెప్పెను "ఓ మహాత్మా! నీ అనుగ్రహం వలన నాకు శాపం నుండి విముక్తి కలిగినది, పిశాచత్వము తొలగినది. ఈ విమలోదక తీర్థము నేటి నుండి పిశాచ మోచన తీర్థముగా పిలవబడుతుంది.ఈ తీర్థ స్నానం వల్ల అందరికీ పిశాచత్వం నశిస్తుంది. ఇక్కడ సంధ్య, తర్పణములు, పిండ ప్రధానములు చేసిన వారి పితరులకు పిశాచత్వము నుండి ముక్తి కలిగి ఉత్తమ గతిని పొందుతారు. ఇక్కడ మార్గశీర్ష మాసం,శుక్లపక్షం చతుర్దశినాడు స్నానములు చేయడం వలన పిశాచత్వము తొలగుతుంది. మార్గశీర్ష మాసం, శుక్లపక్ష చతుర్దశినాడు వార్షిక యాత్ర చేసినవారు దానప్రతిగ్రహ పాపముల నుండి ముక్తిని పొందుతారు.ఇక్కడ స్నానము చేసి కపర్దీశ్వరుడిని అర్చించి అన్న దానము చేసిన వారు ఎక్కడికి వెళ్లినా మరణించిన తర్వాత పిశాచత్వము పొందరు" అని పలికి అదృశ్యం అయ్యేను.కొంతకాలమునకు వాల్మీకి ముని కూడా శివ సాయుజ్యం పొందెను.కథ విన్నవారికి,చదివిన వారికి భూత ప్రేత పిశాచముల బాధ ఉండదు.ఈ కథను బాలగ్రహ పీడితులకు వినిపిస్తే బాలగ్రహపీడలు శాంతించును.ఈ కథ విన్న వారు ఎక్కడికి వెళ్లినను పిశాచముల వలన బాధ ఉండదు.

...ఇంకాఉంది

# స్తోత్రమాలిక

## శ్రీ విష్ణు పంజర స్తోత్రమ్

ప్రవక్ష్యామ్యధునా హ్యేతద్ వైష్ణవం పంజరం శుభమ్ |

నమో నమస్తే గోవింద చక్రం గృహ్య సుదర్శనమ్ |1|

ప్రాచ్యాం రక్షస్వ మాం విష్ణో! త్వామహం శరణం గతః |

గదాం కౌమోదకీం గృహ్య పద్మనాభ! నమోస్తుతే |౨|

యామ్యాం రక్షస్వ మాం విష్ణో! త్వామహం శరణంగతః |

హలమాదాయ సౌనందం నమస్తే పురుషోత్తమ |3|

ప్రతీచ్యాం రక్షమాం విష్ణో త్వామహం శరణం గతః |

ముసలం శాంతనం గృహ్య పుండరీకాక్ష రక్షమామ్ |4|

ఉత్తరస్యాం జగన్నాథ భవంతం శరణం గతః |

ఖడ్గమాదాయ చర్మాథ అస్త్రశస్త్రాదికం హరే |5|

నమస్తే రక్ష రక్షోఘ్న! ఐశాన్యాం శరణం గతః |

పాంచజన్యం మహాశంఖం అనుఘోష్యంచ పంకజమ్ |6|

ప్రగృహ్య రక్షమాం విష్ణో! ఆగ్నేయ్యాం యజ్ఞసూకర |

చంద్రసూర్యం సమాగృహ్య ఖడ్గం చాంద్రమసం తథా |7|

నైరృత్యాం మాం చ రక్షస్వ దివ్యమూర్తే నృకేసరిన్ |

వైజయంతీం సంప్రగృహ్య శ్రీవత్సం కంఠభూషణమ్ |౮|

వాయవ్యాం రక్ష మాం దేవ! హయగ్రీవ! నమోస్తుతే |

వైనతేయం సమారుహ్య త్వంతరిక్షే జనార్దన |౯|

మాం రక్షస్వాజిత సదా, నమస్తేస్త్వపరాజిత |

విశాలాక్షం సమారుహ్య రక్షమాం త్వం రసాతలే |10|

అపూపార నమస్తుభ్యం, మహామీన నమోస్తుతే |

కరశీర్షాద్యంగులీషు సత్య త్వం బాహుపంజరమ్ |11|

కృత్వా రక్షస్వ మాం విష్ణో నమస్తే పురుషోత్తమ |

ఏతదుక్తం శంకరాయ వైష్ణవం పంజరం మహత్ |1౨|

పురా రక్షార్థమీశాన్యాః కాత్యాయన్యా వృషధ్వజ |

నాశయామాస సా యేన చామరం మహిషాసురమ్ |13|


దానవం రక్తబీజం చ అన్యాంశ్చ సురకంటకాన్ |

ఏతత్ జపన్నరో భక్త్యా శత్రూన్ విజయతే సదా |14|



# గురుదేవుల జీవన కవనము

## సప్తవింశతిః అధ్యాయః



పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారితో యాత్రలు చాలా విశేషమైనవి. యాత్రలలో గురుదేవులు భక్తులను అనుగ్రహించారు. గురుదేవులతో యాత్ర చేయటం అంటే సాక్షాత్తు క్షేత్ర దేవతే మనతో యాత్ర చేసిన అనుభూతి కలుగుతుంది .ఎన్ని యాత్రలు చేసినా గురుదేవులతో చేయు యాత్ర మన జీవితం లో కొత్త అనుభూతి కలిగిస్తుంది. గజేంద్ర మోక్షణంలో శ్రీ హరితో పాటు వైకుంఠం మొత్తం కదలివచ్చి గజేంద్రుడుని అనుగ్రహించిన విధంగా గురువుగారితో యాత్ర చేస్తే పరివార దేవతలతో సహితంగా శ్రీ మహా విష్ణువు అనుగ్రహము లభిస్తుంది. యాత్రకు వెళ్ళామా వచ్చామా అని కాకుండా గురుదేవుల యాత్రలో ప్రతి స్థలమునకు ఉన్న మహత్తును భక్తులకు వివరించి తదుపరి దర్శనము చేయిస్తారు. గురు దేవులు యాత్రలో భాగంగా సత్యనారాయణ వ్రతము ,పిత్య కార్యక్రమాలు వంటివి ఆయా క్షేత్ర మహిమలను అనుసరించి భక్తులతో నిర్వహిస్తారు.

.. ఇంకా ఉంది